చెట్లు నరికారని ధర్నా

ధర్నా చేస్తున్న సిద్ధప్ప

మద్నూర్, సెప్టెంబర్ 4: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట ఉన్న చెట్లను విద్యుత్ సిబ్బంది నరికివేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన సిద్ధప్ప బుధవారం గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా చేపట్టాడు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాడు. దీంతో ఎమ్మెల్యే స్పందించి సబ్‌స్టేషన్‌లో 15 మొక్కలను నాటాలని సూచించడంతో యువకుడు ఆందోళన విరమించాడు.

చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

కామారెడ్డి, సెప్టెంబర్ 4 : కామారెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ 2024-2027 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్నిజిల్లా కేంద్రంలోని కేవీఎస్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డె మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్‌రావు, మోటూరి దయానంద్ గుప్తా, యాద నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కంచర్ల లింగం, జనరల్ సెక్రటరీగా సుకుమార్‌గౌడ్, ట్రెజరర్‌గా నర్సింహులు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా పార్శి కాంశెట్టి, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా ఎల్లంకి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కైలాస్ సంతోష్, అడిషనల్ ట్రెజరరీగా అరుణ్ కుమార్, పీఆర్‌వోగా విశ్వనాథుల రాజేందర్, ఆర్గనైజర్లుగా కుంబాల రవి యాదవ్, మోటూరి శ్రీకాంత్, భూమేశ్‌యాదవ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కంచర్ల బాలకిషన్ గుప్తా, కొక్కొండ రవీంద్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల గడువు పొడిగింపు

కామారెడ్డి, సెప్టెంబర్ 4 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, డిసెబుల్డ్ విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి ఫ్రెష్, రెన్యువల్ ఉపకార వేతనాల గడువును డిసెంబర్ 31 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారిణి రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బోర్లంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

బోర్లంలో నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 4 : కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోర్లంలో నాలుగైదు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. పైప్ లీకేజీతో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగు నీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సింగిల్‌ఫేజ్ మోటర్ల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తుండగా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో మోటర్ల ద్వారా గ్రామస్తులకు సరిపడా నీళ్లు అందడం లేదు. దీంతో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ తెలిపారు.

బాన్సువాడలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- మాతాశిశు దవాఖాన భవనం బాగుందని కితాబు
- పాఠశాలలు, దవాఖానను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్

వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

బాన్సువాడ, సెప్టెంబర్ 4 : బాన్సువాడలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 10.30 గంటల వరకే పట్టణానికి చేరుకొని పాఠశాలలు, బాలికల వసతి గృహం, మాతా శిశు దవాఖాన, ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్టీ బాలికల వసతి గృహంలో వసతులను పరిశీలించారు. అనంతరం మాతాశిశు దవాఖానలో పర్యటించి వసతులు, రక్త పరీక్షలు నిర్వహించే గదిని పరిశీలించారు. ఇప్పటివరకు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ కేసులు ఎన్ని నమోద య్యాయి, పరీక్షలు చేసే విధానంపై ఆరా తీశారు. దవాఖాన భవనం బాగుందని కితాబు ఇచ్చారు. రోగుల తాకిడి ఎక్కువగా ఉన్నందున దవాఖానకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కల్కి చెరువు (మినీ ట్యాంకు బండ్‌ను) సందర్శించారు. కట్టపై టైల్స్, బంగ్లాపై కప్పులు ఊడిపోయాయని, వెంటనే మరమ్మతులు చేయించాలని మున్సిపల్ ఏఈని ఆదేశించారు. సమీపంలో ఉన్న మల్టీనరేషన్ పార్కును పరిశీలించారు. ఏఎంసీ మార్కెట్‌లో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎన్ని రేషన్ పాయింట్లకు బియ్యం వెళ్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. మున్సిపల్ చైర్మన్ గంగాధర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రతన్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ మోహన్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, మిషన్ భగీరథ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఇంట్రా ఏఈ శ్రీకాంత్, ఎస్టీ హెచ్‌డబ్ల్యూవో విజయభారతి, కౌన్సిలర్లు ఆమేర్, వెంకటేశ్, నర్సుగొండ తదితరులు ఉన్నారు.

బోర్లం క్యాంపు గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 4 : బాన్సువాడ మండలం బోర్లం క్యాంపు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 5, 6వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజా బుధవారం తెలిపారు. అర్హులైన విద్యార్థినులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు అవగాహన

బీబీపేట్, సెప్టెంబర్ 4 : బీబీపేట్ మండలం యాడారం, దోమకొండ మండలం అంబారీపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు విడివిడిగా కౌమార దశలో జరిగే మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత తదితర అంశాలపై వర్డ్ (ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్) సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. సంస్థ మానిటరింగ్ ఎల్లారెడ్డి డివిజన్ కో-ఆర్డినేటర్ రమేశ్, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్, ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మాచారెడ్డి, సెప్టెంబర్ 4 : అటవీ జంతువులను వేటాడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం ఫారూఖ్ అనే సెక్షన్ ఆఫీసర్ తడ్కపల్లి గ్రామశివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు టీవీఎస్ ఎక్సెల్‌పై అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని విచారించి వారి నుంచి అడవి పందిని, వాటిని చంపడానికి ఉపయోగించే వాటిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు పత్రి ఎల్లయ్య, కర్రి పోచయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

కామారెడ్డి, సెప్టెంబర్ 4 : గురవంటే సమాజానికి మార్గదర్శి... ఆయనో నిత్య విద్యార్థి, రేపటి పౌరులను ఉన్నతులుగా మలిచే శిల్పి. వ్యక్తిత్వాన్ని, నడవడికను, ప్రవర్తననూ తీర్చిదిద్ది జీవితానికో అర్థానిచ్చే మహోన్నతమైన వ్యక్తి గురువు. తల్లి జన్మనిస్తుంది.. గురువు జీవితాన్నిస్తాడు.. ఎంతో మంది విద్యార్థుల జీవితాలు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటాయి. ఈ విధంగా విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే గురువును మన దేశంలో ప్రతి సంవత్సరం గురుపూజోత్సవాలు నిర్వహిస్తారు. నేడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం.

బాల్యం.. విద్యాభ్యాసం..

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబర్ 5న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీ.దూరంలో ఉన్న తిరుత్తనిలో వీరస్వామి-సీతమ్మ దంపతులకు జన్మించారు. తండ్రి వీరస్వామి ఒక జమిందారీలో తహసీల్దార్. వారి మాతృభాష తెలుగు. విద్యాభ్యాసం ఎక్కువగా తిరుత్తనిలో చేశారు. ప్రాథమిక విద్య తిరుత్తని. తిరుపతి, నెల్లూర్, మద్రాస్, క్రిస్టియన్ కాలేజీ తదితర చోట్ల చదివి ఎంఏలో పట్టా పొందాడు. 1906లో 18 ఏండ్ల ప్రాయంలోనే శివకామమ్మతో సర్వేపల్లి వివాహం జరిగింది. ఈ దంపతులకు ఐదుగురు కూతుళ్లు, ఒక కుమారుడు.

సర్వేపల్లికి దక్కిన గౌరవం..

ఉపాధ్యాయ వృత్తికి ఆయన తెచ్చిన గుర్తింపు, గౌరవానికి ప్రతి సంవత్సరం ఆయన పుట్టిన రోజును (సెప్టెంబర్ 5) ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకొంటారు. 1931లో బ్రిటీష్ ప్రభుత్వం వారు ఇచ్చే ప్రతిష్ఠాత్మక సర్ బిరుదు ఈయనను వరించింది.

1954లో మానవ సమాజానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన భారతరత్న బిరుదు పొందారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలైన ఆక్స్‌ఫర్డ్ కేంబ్రిడ్జ్ తదితరాల వాటి నుంచి వందకు పైగా గౌరవ పురస్కారాలు, డాక్టరేట్లు సంపాదించాడు.

ఘనంగా శ్రీకృష్ణ ఉత్సవం

బాన్సువాడ, సెప్టెంబర్ 4 : పట్టణంలోని శ్రీసరస్వతీ ఫంక్షన్‌హాల్‌లో కామారెడ్డి ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు వ్యవసాయ శాఖ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు బహుమతులు అందజేశారు. ఇస్కాన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీమాన్ వెంకటదాస్, ముఖ్యప్రముఖులు శ్రీరామదాస్ (హైదరాబాద్), శ్రీమాన్ సిద్ధ బలరాందాస్ పాల్గొన్నారు.

డెంగ్యూ రాకుండా మందుల పంపిణీ

కామారెడ్డి, సెప్టెంబర్ 4 : జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో హోమియోపతి వైద్యుడు డాక్టర్ హరీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డెంగ్యూ రాకుండా ముందస్తుగా హోమియోపతి మందులను పంపిణీ చేశారు. బ్రాంచ్ మేనేజర్ కృష్ణమోహన్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ హిమాన్ చౌహాన్ పాల్గొన్నారు.

బాన్సువాడ మండలం పోచారం గ్రామంలో బుధవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాల్‌రాజ్‌తో కలిసి హోటల్‌ను ప్రారంభించి టిఫిన్ చేస్తున్న ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి.
– బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 4

సంక్షిప్తంగా..

వినాయక విగ్రహం ఏర్పాటుపై ఫిర్యాదు

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 4 : బీర్కూర్‌లోని కామప్ప చౌరస్తా వద్ద విగ్రహం ఏర్పాటు చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గణేశ్ మండలి సభ్యులు తహసీల్దార్ లత, ఎస్సై రాజశేఖర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు.

నీట మునిగినపంట వివరాల సేకరణ

భిక్కనూరు, సెప్టెంబర్ 4 : రెండు, మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినగా వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం వివరాలను సేకరించారు. మండలంలోని కాచాపూర్‌లో నీట మునిగిన వరి, మక్కజొన్న పంటలను మండల వ్యవసాయాధికారి రాధారెడ్డి పరిశీలించారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 4 : జిల్లాలోని దివ్యాంగులు సదరం క్యాంపునకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సెప్టెంబర్ 11, 25వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు క్యాంపును నిర్వహించనున్నట్లు తెలిపారు. రెన్యువల్‌కు సంబంధించిన వారు మాత్రం ఈ నెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు టోకెన్‌ను బుక్ చేసుకోవాలని సూచించారు.

నేడు మూడో విడుత సామాజిక తనిఖీ

బీబీపేట్, సెప్టెంబర్ 4 : ఉపాధి హామీ పథకంలో భాగంగా బీబీపేటతోపాటు ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనుల వివరాలను గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మూడో విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మొబైల్ ఫోన్ అందజేత

మాచారెడ్డి, సెప్టెంబర్ 4 : కామారెడ్డికి చెందిన చిన్నోజి రమేశ్ ఇటీవల తనఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం అందజేశారు. ఫోన్ పోగొట్టుకున్నవారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 4 : మండలంలోని అంకోల్ తండా గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఎంపీవో సూర్యకాంత్, బుధవారం పరిశీలించారు. నస్రుల్లాబాద్‌లో ఆగి ఉన్న వర్షపు నీటిలో పారిశుద్ధ్య కార్మికులు ఆయిల్ బాల్స్ వేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు రాజేశ్, ముఖీద్ ఉన్నారు.

కమ్యూనిటీ మీడియేటర్లకు సర్టిఫికెట్ల పంపిణీ

మద్నూర్‌లో సర్టిఫికెట్లను అందజేస్తున్న తహసీల్దార్లు, ఎల్లారెడ్డిలో ఎస్సై

మద్నూర్/ ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 4: మద్నూర్ తహసీల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కమ్యూనిటీ మీడియేటర్లకు సర్టిఫికెట్లను మద్నూర్, డోంగ్లీ తహసీల్దార్లు ముజిబ్, రేణుక పంపిణీ చేశారు. మద్నూర్ గ్రామానికి చెందిన ఉడతావార్ సురేశ్, రిటైర్డ్ ఏఎస్సై అశోక్‌కు సర్టిఫికెట్లను అందజేశారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ఇటీవల నిర్వహించిన శిక్షణ శిబిరంలో మూడు రోజులపాటు వారు పాల్గొన్నారని తహసీల్దార్లు తెలిపారు. మండలం నుంచి ఇద్దరు శిక్షణ తీసుకోవడంపై తహసీల్దార్లు హర్షం వ్యక్తంచేశారు. మధ్యవర్తిత్వం ద్వారా సత్వర న్యాయం కోసం కమ్యూనిటీ మీడియేటర్లు కీలక పాత్ర పోషిస్తారని తహసీల్దార్లు తెలిపారు. ఎల్లారెడ్డి మండలం నుంచి శ్రీనివాస్‌చారి, సంగప్ప, ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్ కమ్యూనిటీ మీడియేటర్ శిక్షణను పొందారని ఎస్సై మహేశ్ తెలిపారు. ఈమేరకు శ్రీనివాస్‌చారికి ఎస్సై బుధవారం ధ్రువీకరణ పత్రం అందజేశారు. మీడియేటర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి

గాంధారి, సెప్టెంబర్ 4: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్ పంచాయతీ సిబ్బంది సూచించారు. ఆయన బుధవారం మండలంలోని సర్వాపూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం సమీపంలో నిలిచిన నీటిని తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, మాజీ సర్పంచ్ మనోహర్‌రావు తదితరులు ఉన్నారు.

శుభ్రతపై దృష్టి సారించాలి..

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 4: ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలని ఎంపీవో ప్రకాశ్ సూచించారు. మండలంలోని అల్మాజీపూర్ గ్రామాన్ని ఆయన బుధవారం సందర్శించారు. గ్రామంలోని వాడల్లో పర్యటిస్తూ.. ప్రజలకు పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

సర్వాపూర్‌లో జీపీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్

గుంతల్లోని నీరు తొలగింపు

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 4: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో గ్రామానికి చెందిన పలువురు యువకులు బుధవారం శ్రమదానం చేసి గుంతల్లో నిలిచిన నీటిని తొలగించారు. ప్రస్తుతం గ్రామానికి మట్టి రోడ్డు ఉన్నదని, తారు రోడ్డు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. యువకులు మహేందర్, రవీందర్, ప్రశాంత్, శివ తదితరులు శ్రమదానంలో పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

మద్నూర్‌లో మాట్లాడుతున్న సీఐ నరేశ్

రాజంపేటలో కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు..

పెద్దకొడప్‌గల్‌లో ఎస్సై రాజు..

శాంతి కమిటీ సమావేశాల్లో అధికారుల సూచన

కామారెడ్డి/ మద్నూర్/ పెద్దకొడప్‌గల్/ నాగిరెడ్డిపేట/ భిక్కనూరు/ రాజంపేట, సెప్టెంబర్ 4: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు సూచించారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం కామారెడ్డి బల్దియా పరిధిలోని గణేశ్ మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. నవ రాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దేవునిపల్లి సీఐ రామన్, ఎస్సై రాజు, తహసీల్దార్ గణేశ్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ నరేశ్ సూచించారు. మద్నూర్‌లోని రైతువేదికలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో మద్నూర్, డోంగ్లీ తహసీల్దార్లు ముజీబ్, రేణుక, ఎంపీడీవో రాణి, ఎస్సై విజయ్‌కొండ, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన శాంతి కమిటీ సమావేశంలో ఎల్లారెడ్డి సీఐ రవీందర్ మాట్లాడుతూ.. పండుగలను కులమతాలకు అతీతంగా జరుపుకోవాలన్నారు. విద్యుత్ కోసం సంబంధిత అధికారుల నుంచి అనుమతి పొందాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై మల్లారెడ్డి, ఆయా గ్రామాల వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లోని ఆర్యవైశ్య సంఘ భవనంలో ఎస్సై రాజు ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ.. శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. అల్లర్లు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

భిక్కనూరులోని పద్మశాలీ సంఘంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్, తహసీల్దార్ శివ ప్రసాద్, పోలీసు సిబ్బంది, గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

రాజంపేట్‌లోని రైతు వేదికలో వినాయక మండపాల నిర్వాహకులతో డీఎస్పీ నాగేశ్వర్‌రావు సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్, గ్రామ ప్రత్యేకాధికారి రాజేశం, భిక్కనూరు సీఐ సంపత్ ఎస్సై పుష్పరాజ్, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బాన్సువాడ రూరల్/రామారెడ్డి, సెప్టెంబర్ 4 : బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజారాం దుబ్బ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లచ్చిరాం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. తోటి ఉపాధ్యాయులు ఆయనకు శాలువా కప్పి, పూలమాలలతో బుధవారం సన్మానించారు. రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట్ స్కూల్‌తండాకు చెందిన విఠబోయిన అనిల్‌కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనట్లు హెచ్ఎం వేణుగోపాల్‌రావు తెలిపారు. వీరిని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించే సమావేశంలో సన్మానిస్తారని పేర్కొన్నారు.

హైదరాబాద్ తరలిన విద్యుత్ సిబ్బంది

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 4: మెరిట్ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని కోరుతూ మండలం నుంచి పలువురు విద్యుత్ సిబ్బంది బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విద్యుత్ సౌధ మహాధర్నాకు తరలివెళ్లారు. ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా మెరిట్ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించినట్లు నాగిరెడ్డిపేట ఏఈ మనోరంజన్ తెలిపారు. హైదరాబాద్ తరలివెళ్లిన వారిలో లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, లైన్‌మన్ రాములు తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331758

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

డిగ్రీ కాలేజీలో నేడు, రేపు స్పాట్ అడ్మిషన్లు

రామారెడ్డి, సెప్టెంబర్ 4: సదాశివనగర్‌లోని మల్లన్న గుట్ట వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కాలేజీలో నేడు, రేపు(గురు, శుక్రవారాల్లో) స్పాట్ అడ్మిషన్లు ఇస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014-25విద్యా సంవత్సరానికి సంబంధించి బీఏ, బీకామ్, బీఎస్సీ గ్రూపుల్లో మిగిలిన సీట్ల కోసం బీసీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రాజెక్టును సందర్శించిన అదనపు కలెక్టర్

నాగిరెడ్డిపేట,